ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
మంగళవారం 25 జూన్ 2024



ఎంపీలుగా ప్రమాణం



పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బస్తిపాటి నాగరాజు



పార్లమెంట్‌లో కుటుంబ సభ్యులతో ఎంపీ బస్తిపాటి నాగరాజు



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

కర్నూలు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి)/నంద్యాల (నూనెపల్లె): కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందిన బస్తిపాటి నాగరాజు సోమవారం లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేశారు. అలాగే నంద్యాల పార్లమెంట్ నుంచి గెలుపొందిన బైరెడ్డి శబరి కూడా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌సభ ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. నాగరాజు ప్రమాణ స్వీకర మహోత్సవాన్ని పార్లమెంట్ విజిటింగ్ గ్యాలరీ నుంచి ఆయన కుటుంబ సభ్యులు వీక్షిస్తూ ఆనందంతో మురిసిపోయారు. అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఒక సామాన్యుడిని పార్లమెంట్‌కు పంపిన ఘనత తమ అధినేత, సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇదిలాఉంటే నంద్యాల లోక్ సభ చరిత్రలో తొలి మహిళా ఎంపీగా బైరెడ్డి శబరి చరిత్ర పుటల్లో నిలిచారు. రాజకీయ కుటుంబం నుంచి వారసురాలుగా వచ్చిన డాక్టర్ బైరెడ్డి శబరి చిన్న వయస్సులోనే ఎంపీగా విజయం సాధించడం ప్రత్యేకతను సంతరించుకుంది.

నాడు – నేడు కష్టాలు

- పాఠశాలల్లో అసంపూర్తిగా నిర్మాణాలు
- ఇసుక, నిధుల లేమితో నిలిచిన పనులు
- విద్యార్థులకు తప్పని అవస్థలు

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో..

నంద్యాల (నూనెపల్లె), జూన్ 24:
ఈ చిత్రంలో కనిపిస్తున్నది నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్. ఈ పాఠశాలను నాడు-నేడు రెండో విడతలో ఎంపిక చేశారు. రూ.94 లక్షల మేర పాఠశాలలో మేజర్ మైనర్ రిపేర్లకు నగదు మంజూరు చేశారు. ఇప్పటి వరకు రెండు బ్లాక్‌లకు సంబంధించి స్లాబులు మౌలిక సదుపాయాలు ప్లాస్టరింగ్ వరకు పనులు పూర్తి కావడంతో ఆ తరగతి గదుల్లో తరగతులు కొనసాగుతున్నాయి. చిత్రంలో కనిపిస్తున్న భవనానికి స్లాబును పూర్తిగా తీసివేశారు. పాఠశాల ఖాతాలో నగదు ఉన్నప్పటికీ ఇసుక కొరతతో పనులు ఆగి పోయాయి. ఇసుక అందుబాటులోకి వచ్చే వరకు ఈ పనులు ఇలానే ఆగిపోయే పరిస్థితి. వెంటనే పనులు ప్రారంభిస్తామని పాఠశాల హెచ్‌ఎం చలపతి చెప్పుకొచ్చారు.





ప్యాపిలిలో అసంపూర్తిగా పాఠశాల భవనం

ఇది ప్యాపిలిలోని అసంపూర్తిగా ఉన్న బాలుర ఉన్నత పాఠశాల. గత ప్రభుత్వం రెండో విడత కింద ఈ పాఠశాల పనులు చేపట్టింది. ఇందుకు గాను రూ.96 లక్షలు నిధులను కేటాయించింది. ఈ పనుల్లో భాగంగా 12 అదనపు గదుల నిర్మాణ పనులను చేపట్టారు. అయితే రెండేళ్లుగా ఈ పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుతం పెయింటింగ్, ఫ్లోరింగ్ కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే తప్ప తరగతుల గదులు వినియోగంలోకి రావు. ఈ విద్యా సంవత్సరం కూడా గదుల కొరతతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి.

నాడు-నేడు కింద పాఠశాలల దశ దిశ మార్చేశామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పినా విద్యార్థులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. మొదటి దశలో కొన్ని పాఠశాలల్లో వివిధ రకాల పనులు చేపట్టినా వాటిల్లో కొన్ని పూర్తి కాలేదు. అలా పెండింగ్ ఉన్న పాఠశాలలను రెండో విడత జాబితాలో చేర్చారు. అయితే రెండో విడత పనులు పూర్తిగా పెండింగ్‌లో ఉండిపోయాయి. వీటిని పూర్తి చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేతులేత్తేసింది. కొన్ని చోట్ల పాఠశాలల నిర్మాణాలు శ్లాబుల దశలో ఉండగా మరి కొన్ని చోట్ల గోడలకు ప్లాస్టరింగ్ వేసే దశలో, మరికొన్ని పాఠశాలలకు పెయింటింగ్ వేసే దశలో ఉన్నాయి. జగన్ ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం మే లోపు పనులు పూర్తి కావాలి. అంటే కొత్త ప్రభుత్వం ఏర్పడేలోపు పాఠశాలల నిర్మాణాలు అందుబాటులోకి రావాలి. అయితే గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో చాలా పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. వారి నిర్వాకం వల్ల విద్యార్థులు అవస్థలు పడాల్సిన పరిస్థితి.

2022 జూన్‌లో నాడు-నేడు రెండో విడత పనులు ప్రారంభించారు. 2023 మే నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. కాని రెండు సంవత్సరాలైనా నేటికీ పనులు పూర్తి కాలేదు. పనులు పూర్తి కాకపోవడానికి ప్రధానంగా ఇసుక, నిధుల కొరత కారణమని తెలుస్తోంది. ఇసుక ఉన్నప్పుడు నిధులు మంజూరు కాలేదు. నిధులు ఉన్నప్పుడే ఇసుక రాలేదని అధికారులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విధానం వల్ల ఇసుక కొరత తీవ్రంగా ఏర్పడింది. అయినా వైసీపీ ప్రభుత్వ తీరులో మార్పు రాలేదు. ఇసుక కొరత తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో జిల్లాలో చేపట్టిన రెండో విడత పనులకు ఐదు వేల టన్నుల ఇసుక అవసరమని జిల్లా అధికారులు రాష్ట్ర స్థాయి అధికారులకు ఎప్పటి నుంచో మొరపెట్టుకుంటు న్నారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. గతంలో పనుల కోసం సరఫరా చేసిన ఇసుక కుప్పలు పనులు సక్రమంగా సాగకపోవటంతో మట్టి పాలయ్యాయి. ఆడుదాం ఆంధ్ర సమయంలో మరికొంత ఇసుక మైదానాల్లో కలిసిపోయింది. దీంతో అంతకుముందు సాగుతున్న పనులు కూడా ఆగిపోయాయి. ఇలా పనులు పూర్తి కాకపోవటంతో ఆ ఒత్తిడి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై పడింది. దీంతో బోధనా పరంగా పాఠశాల నిర్వహణ పెద్ద తలనొప్పిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కప్పలకుంటలో అసంపూర్తిగా ఉన్న పనులు

ఆత్మకూరు: నాడు-నేడు కింద ప్రభుత్వ రూపురేఖల్ని మార్చేశామని గత ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. ఈ నేపథ్యంలోనే ఆత్మకూరు మండలంలో రెండో విడత నాడు-నేడు కింద 39 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు గరిష్టంగా రూ.2 కోట్ల నుంచి రూ.18లక్షల వరకు మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రధానంగా తరగతి గదులు, విద్యుద్దీకరణ, వంట గదులు, మరుగు దొడ్లు, తాగునీటి సదుపా యం, రంగులు తదితర సమస్యలన్ని పరిష్కరించాల్సి ఉంది. అయితే ఈ పనులన్నీ గత విద్యా సంవత్సరం లోనే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ నిధుల కొరత వల్ల నేటికీ అసంపూర్తిగా మిలిగాయి. దీంతో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ నాడు-నేడు పనులు పూర్తికాకపోవడంతో పాఠశాలల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం మారిపో వడంతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యం జరిగే అవకాశం లేకపోలేదు. విద్యా సంవత్సరంలో చాలీ చాలని గదుల్లో చెట్ల కింద పాఠాలు విన్న విద్యార్థులకు ఈ సారైనా కష్టాలు తప్పుతాయో లేదోనన్న పరిస్థితి నెలకొంది.



తెలుగుపేటలో నిలిచిన పాఠశాల నిర్మాణం పనులు

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలోని 5 మండలాల్లో రెండో విడత నాడు-నేడు కింద 165 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టడానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.73 కోట్ల నిధులు విడుదలయ్యాయి. కాని ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో పాఠశాలల్లో నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రభుత్వం అంచనా వేసిన దానికి విరుద్ధంగా రూ.24.5 కోట్ల విలువగల పనులు మాత్రమే పూర్తయ్యాయి. పూర్తైన పనులకు సరిగా నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో మిగతా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కోవెలకుంట్ల మండలంలో 26 పాఠశాలలకు 9.6 కోట్ల నిధులు మంజూరుకాగా 3.2 కోట్ల నిధుల పనులు మాత్రమే జరిగాయి. అవుకు మండలంలో 26 పాఠశాలలకు రూ.10 కోట్లు మంజూరు కాగా రూ. 3.50 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. బనగానపల్లె మండలంలో 49 పాఠశాలలకు రూ.22 కోట్లు మంజూరు కాగా 7.50 కోట్లు ఖర్చు చేశారు. సంజామల మండలంలో 27 పాఠశాలలకు రూ. 14.1 కోట్లు మంజూరు కాగా రూ.4.9 కోట్లు నిర్మాణం పనులు పూర్తి చేశారు. కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 37 పాఠశాలలకు 17.3 కోట్లు మంజూరుకాగా కేవలం 5.4 కోట్ల నిధులతో పాఠశాలల నిర్మాణం పనులు పూర్తి చేశారు.

జిల్లాలో పరిస్థితి..


జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలలు 1417 ఉన్నాయి. వీటిలో 34 ఎయిడెడ్ పాఠశాలలు మినహాయిస్తే రెండో విడత నాడు-నేడులో జిల్లాలో 853 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో 608 ప్రాథమిక, 59 ప్రాథమికోన్నత పాఠశాలలు, 186 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో నిర్మాణాల కోసం రూ.363.10 కోట్లను వెచ్చిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరు చేయటంలో శ్రద్ధ వహించలేదు. నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాకపోవడంతో అనేక పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం నాడు-నేడు రెండో విడత పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉద్దేశంతో కొంతమంది కాంట్రాక్టర్‌లు నాడు-నేడు పనులను ఈ ఏడాది మార్చిలోనే నిలిపివేశారు. ఇలా అసంపూర్తిగా వదిలేసిన పనులతో ఆయా పాఠశాలల్లో ఉన్న నిర్మాణ సామగ్రి వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందన్నది మాత్రం వాస్తవం. ఇలా అయితే ఈ ఏడాది విద్యార్థుల చదువులు చెట్ల కిందే చదువుకోవాల్సిన పరిస్థితి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం దీనిపైన ప్రత్యేక శ్రద్ధ వహించి తగు నిర్ణయిం తీసుకుంటే విద్యార్థుల ఆటంకాలు తొలగిపోతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నందికొట్కూరు: వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన నాడు-నేడు పనులు అరకొరగానే పూర్తయ్యాయి. వైసీపీ ఐదేళ్ల కాలంలో కొన్ని చోట్ల నాడు నేడు పనులు పునాదులకే పరిమితం కాగా, మరికొన్ని చోట్ల మధ్యలోనే ఆగిపోగా, ఇంకొన్ని చోట్ల నిర్మాణాలు నత్తకు నడక నేర్పుతున్నాయి. నందికొట్కూరు మండలంలో ఫేజ్-1లో 13 పాఠశాలల్లో రూ.4.06,63,000 నిధులతో 97 పనులు పూర్తి చేయగా ఫేజ్-2లో 38 పాఠశాలల్లో 639 పనులకుగాను రూ.14,59,57,000ల నిధులతో పనులు చేపట్టగా అందులో 392 పనులు పూర్తయ్యాఇ. 247 పనుల్లో కొన్ని జరుగుతుండగా మరికొన్ని ఆగిపోయాయి.



మిడ్తూరు కేజీబీవీలో నాడు-నేడు కింద నిర్మాణంలో ఉన్న తరగతి గదులు

- మిడ్తూరు మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో చేపట్టి నాడు -నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మండల కేంద్రంలో జడ్పీహెచ్ హైస్కూల్, తలముడిపిలో రెండు తరగతి గదులు, అలగనూరులో రెండు తరగతి గదులు, చెరుకుచెర్లలో మూడు తరగతి గదులు నిర్మాణంలో ఉన్నాయి. జలకనూరు ఎంపీయూపీఎస్ కాంపౌండ్ వాల్ నిర్మాణంలో ఉండగా, ఎంపీపీఎస్ జలకనూరు, సుంకేసుల గ్రామాల్లో గదులు పూర్తి కాలేదు. మిడ్తూరు కేజీబీవీ పాఠశాలలో 8 తరగతి గదులు పూర్తి కాలేదు. ఏడబ్ల్యూసీకి చెందిన జలకనూరు సుంకేసుల గ్రామాల్లో గదులు నిర్మాణంలో ఉన్నాయి.
- జూపాడుబంగ్లా మండలం బాస్కరాపురంలో ప్రారంభించిన నాడు-నేడు పనులు పునాదులకే పరిమితమయ్యాయి.
- పగిడ్యాల మండలం పడమర నెహ్రూనగర్‌లో ఎంపీపీ పాఠశాలలో నాడు-నేడు పనుల కింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.



బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మాణ దశలో ఉన్న తరగతి గదులు

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 24: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమానికి నూతన ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేసే అవకాశం ఉందన్నారు. అనంతరం 79 మంది తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

డెంగీ, మలేరియా నియంత్రణపై శ్రద్ధ తీసుకోండి

నంద్యాల (కల్చరల్), జూన్ 24: దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్.కె.శ్రీనివాసులు వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కీటక జనత వ్యాధులైన మలేరియా, డెంగీ కేసుల నియంత్రణపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బేతంచెర్ల, డోన్, మిడుతూరు, కొత్తపల్లి, నంద్యాల ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో సీరియస్‌గా తీసుకొని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశిం చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీపీవో మంజులవాణి, డీఈవో సుధాకర్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, అన్ని సంక్షేమ హాస్టళ్ల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు

బాధితులకు న్యాయం చేస్తాం

ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, జూన్ 24: బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేయించి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు. బాధితుల నుంచి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా ఎస్పీకి విన్నవించుకున్నారు. సమస్యలను తెలుసుకున్న ఎస్పీ సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్ర మంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, ఎస్పీ సీసీ నాగరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ కాళ్లకు మొక్కిన రైతు

● మా పొలం మాకు ఇప్పించడంటూ వేడుకోలు



తహసీల్దార్ దామోదరెడ్డికి కాళ్లకు మొక్కుతున్న రైతు మధుసూదన యాదవ్

నందికొట్కూరు రూరల్, జూన్ 24: 'అయ్యా మా పొలం మాకు ఇప్పించండంటూ' సోమవారం ఓ రైతు తహసీల్దార్ దామోదరెడ్డి కాళ్లకు మొక్కారు. ఈ ఊహించని పరిణామంతో ఖంగుతిన్న తహసీల్దార్ వెంటనే ఆయనను పైకి లేపారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దామగట్లకు చెందిన రైతు మధుసూదన యాదవ్ సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి నిరసనకు దిగాడు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహిస్తుండగా కుటుంబ సభ్యులతో వచ్చి తమ పొలాన్ని బంధువులు ఆన్‌లో ఎక్కించుకున్నా రని, అది తొలగించి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం బాధిత రైతు తహసీల్దార్‌తో మాట్లాడుతూ దామగట్ల గ్రామ పొలిమేరలోని సర్వే నెంబర్ 192-2లో 1.06 ఎకరాలు తమ అమ్మ లక్ష్మీదేవమ్మకు, సర్వే నెంబర్ 279-1లో 0.80 సెంట్లు, సర్వే నెంబర్ 279-2లో 0.24 సెంట్లు తనకు ఉందని తెలిపాడు. అది తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమి అని, తమ పేర్లపై మ్యాన్యువల్ రికార్డులు ఉన్నా స్థానిక వీఆర్వో అక్రమంగా తమ బంధువులకు ఆన్‌లైన్ చేశాడని ఆరోపించాడు. ఈ విషయంపై నాలుగేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని వాపోయాడు. ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు.

దాతల సొమ్ము దుర్వినియోగంపై లోకాయుక్తలో ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు

కోడుమూరు (రూరల్), జూన్ 24: కోడుమూరు మండలంలోని అమడగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతలు అందించిన సొమ్ము దుర్వినియోగమైందని కర్నూలు లోక్‌సభ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి దాతలు సుమారు రూ 2 లక్షలు సొమ్ము ఇచ్చారు. దీనికి వచ్చే వడ్డీతో ఏటా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆగస్టు 15న నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు తెలిపారు. అయితే 2023లో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందలేదని తెలిపారు. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయులను నిలదీయగా పొంతన లేని సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. సొమ్ము లెక్కలు తేల్చాలని ఈ ఏడాది ఫిబ్రవరి 26న కలెక్టర్, డీఈవోలకు స్పందనలో అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై విచారణాధికారిగా డిప్యూటీ డీఈవోను నియమించారని తెలిపారు. అయినను ఎంక్వైరీ చేపట్టలేదని ఆరోపించారు. పైగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా విచారణ జరిపించి దాతల సొమ్ము వాడుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

వ్యవసాయ బోరు బావి ధ్వంసం

సి. బెళగల్, జూన్ 24: మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామానికి చెందిన కృష్ణ అనే రైతు పొలంలోని వ్యవసాయ బోరుబావిని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. రైతు సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా బోరుబావిని రాయితో ధ్వంసం చేసి బోరుబావిలోకి రాళ్లు వేసినట్లు కనిపించింది. ఇటీవల రూ లక్షన్నర అప్పు చేసి బోరు వేయించుకున్నానని రైతు తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి గ్రామంలో విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెండ్

జూపాడుబంగ్లా, జూన్ 24: పంచాయతీ కార్యదర్శి సామేలు, సచివాలయ కార్యదర్శి మంజులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. అలాగే ఈవోఆర్డీ మధుమోహన్‌చక్రవర్తికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. కలుషిత నీరు తాగి మండలంలోని పోతులపాడు మజరా గ్రామం చాబోలులో కలుషిత నీరు తాగి 30 మందికిపైగా అస్వస్థతకు గురికావడమే కాకుండా ఒకరి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

కోవెలకుంట్ల, జూన్ 24 : కోవెలకుంట్ల పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ వద్ద ఓ వ్యక్తి అదృశ్యంకావడంతో కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. కడప జిల్లా ముద్దనూరు మండలం కె.తిమ్మాపురం గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి తండ్రి ప్రభాకర్‌రెడ్డి బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వచ్చే క్రమంలో కనిపించకుండాపోయాడు. సోమవారం కోవెలకుంట్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తా

ఆళ్లగడ్డ, జూన్ 24: 40వ జాతీయ రహదారిలోని బత్తలూరు గ్రామం వద్ద ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు వెళ్తున్న గ్యాస్ సిలిండర్ల ఆటో అదుపు తప్పి సోమవారం బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరూ ప్రమాదానికి గురి కాక పోవడంతో గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

హత్యా.. ఆత్మహత్యా?



బాబుప్రసాద్ (ఫైల్)

అవుకు, జూన్ 24 : నంద్యాల జిల్లా అవుకు పట్టణం ఈబీసీ కాలనీకి చెందిన బాయకాటి బాబుప్రసాద్ (20) మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఈ ఘటన జరిగింది. ఉదయం 11-30గంటల వరకు కుటుంబ సభ్యులతో కలసి తిరిగిన ప్రసాద్ మధ్యాహ్నం 12-30 గంటలకే రిజర్వాయర్‌లో దూకి మృతి చెందటం నమ్మశక్యంగా లేదని, తల వెనుక భాగంలో బలమైన గాయం ఉందని తల్లి వరలక్ష్మమ్మ రోదించారు. ఉదయం బాబుప్రసాద్ కుటుంబ సభ్యులు, ఇంటి పక్కన ఉన్న వారు ఇంటి స్థలం విషయంలో గొడవ పడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఆ తర్వాత ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి వరలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కోవెలకుంట్ల, జూన్ 24 : కోవెలకుంట్ల పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో నకిలీ బంగారు గాజులు తాకట్టు పెట్టి సుమారు రూ.8.54 లక్షల రుణం తీసుకొని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉయ్యాలవాడ మండలం మాయలూరు గ్రామానికి చెందిన నక్కా లక్ష్మీనారాయణ, సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన దూదేకుల అమీర్ కోవెలకుంట్ల పట్టణంలోని ముత్తూట్‌లో నకిలీ బంగారు గాజులు పెట్టి రుణం పొందారు. లక్ష్మీనారాయణ 23.5.2018లో నకిలీ బంగారు గాజులు పెట్టి రూ.1.73 లక్షలు, 25.5.2023న నకిలీ గాజులు పెట్టి రూ.1.90 లక్షలు రుణం తీసుకున్నాడు. అలాగే అమీర్ 5.7.2023న నకిలీ బంగారు గాజులు పెట్టి రూ.1.83,025లు, రెండోసారి 24.7.2023న నకిలీ బంగారు కడియం పెట్టి రూ.1,20,025 అప్పు తీసుకున్నారు. వీరు తాకట్టు పెట్టిన బంగారు గాజుల్లో శాతమే బంగారం ఉందని తేలాక బ్యాంకు మేనేజరు దూదేకుల మహబూబ్‌బాషా సోమవారం కోవెలకుంట్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం.. కేసు నమోదు

పాణ్యం, జూన్ 24 : మండలంలోని తమ్మరాజుపల్లెలోని హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. ఈ నెల 22వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేసి వాటిపై ముద్రించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చిత్రాలను ధ్వంసం చేసినట్లు సర్పంచ్ విజయగౌరి సోమవారం ఫిర్యాదు చేశారన్నారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం రాయితీ ఇవ్వాలి

జేసీకి ఏపీయూడబ్ల్యూజే నాయకుల వినతి



వినతి పత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు(కల్చరల్), జూన్ 24: వివిధ పత్రికలు, మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 60 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఐజేయూ జాతీయ సమితి సభ్యులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడ్, సహాయ కార్యదర్శి శివ, చిరంజీవి, హెచ్ఎం టీవీ స్టాఫ్ రిపోర్టర్ హరికిషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె తక్షణమే స్పందించి ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈఓ శ్యామూల్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 60 శాతం ఫీజు రాయితీ అందించి ఆదుకోవాలని కోరారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని జీవో ఇచ్చిందని, ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని అన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా ఇంటి స్థలం, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు అశోక్‌గౌడ్, అంజి, యల్లాగౌడ్, హుస్సేన్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

వెలుగులోకి మరో వైసీపీ అక్రమ కట్టడం



ఆదోనిలో అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయం

ఆదోని టౌన్, జూన్ 24: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో ఒకటో రోడ్డులో ఉన్న వైసీపీ కార్యాలయ భవనం మునిసిపల్ అనుమతులు లేకుండానే నిర్మించిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. 2021లో భవన నిర్మాణం కోసం ఆన్‌లైన్ ద్వారా ప్లాన్ దాఖలు చేసి, మొదటి విడత ఫీజుగా రూ.పది వేలు చెల్లించారు. ప్లాన్ మంజూరుకు అవసరమైన అన్ని డాకుమెంట్లు దాఖలు చేస్తూ మిగతా ఫీజు చెల్లించాల్సి ఉండగా అవేవి చేయకుండానే రెండు అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అందులో వైసీపీ కార్యాలయం కూడా ఆర్భాటంగా ప్రారంభించారు. సోమవారం ఈ విషయం బయటికి పొక్కడంతో హడావుడిగా రెండో విడత ఫీజు చెల్లించారు. ప్లాన్ మంజూరు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న విమర్శలు రావడంతో అధికారులపై కమిషనర్ మండిపడ్డారు. వైసీపీ కార్యాలయానికి అనుమతులు ఉన్నాయని, తనను తప్పుదోవ పట్టించిన ఏసీపీ పై శాఖా పరమైన చర్యల కోసం పై అధికారులకు నివేదిస్తూ, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన వార్డు ప్లానింగ్ సెక్రెటరీను తక్షణం సస్పెండ్ చేయాలని ఆదేశించామని, ప్లాన్ వేసిన ఎల్టీపీ లైసెన్సును రద్దు చేస్తున్నట్లు కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. అక్రమ నిర్మాణంగా భావించి భావనాన్ని సీజ్ చేస్తామని తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

కౌతాళం, జూన్ 24: మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన చోరి కేసును 24 గంటలు గడవ మునుపే కౌతాళం పోలీసులు ఛేదించారు. చోరీ సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన దేవన్నగౌడ్ సోమవారం తన ఇంటి మిద్దె మీద నిద్రించగా రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లను దొంగలించినట్లు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక పరిజ్ఞానంతో హెడ్‌కానిస్టేబుల్ సోమ్లా నాయక్ పీసీలు వీరాంజనేయులు, నరేంద్ర, మద్దిలేటి, వీరేష్, వీరభాస్కర్‌లు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడు వాసయ్య గారి ఈరన్నను అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి దొంగలించిన ఐదు తులాల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లను, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రులు



ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు

శ్రీశైలం, జూన్ 24: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలంగాణ రాష్ట్రం డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క దంపతులు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుక్ను వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వీరికి వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి శ్రీశైలం జలవిద్యుత్ ఉత్పత్తి అత్యంత ముఖ్యమైనదని అన్నారు. జలవిద్యుత్ ఉత్పత్తిపై సమీక్ష నిర్వహించడానికి వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 2029-30 వరకు విద్యుత్ కొరత లేకుండా ప్రణాళికతో వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ధరల నియంత్రణకు చర్యలు చేపట్టండి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ

నంద్యాల (కల్చరల్), జూన్ 24: కూరగాయలు, నిత్యావసర వస్తువులు ధరల పెరుగుదలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన చాంబర్‌లో ధరల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మజ, మార్కెటింగ్ ఏడీ అబ్దుల్ రెహమాన్, ఉద్యానశాఖ అధికారి నాగరాజు, డీఎస్ఓ వెంకటరాముడు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు లాభదాయకంగా ఉండటంతో పాటు వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలు అందించే సరఫరాదారులను గుర్తించి నివేదిక అందజేయాలని అన్నారు. హార్టికల్చరల్ డిపార్ట్‌మెంట్ డాటా ప్రకారం స్థానిక కూరగాయల రైతుల నుంచి కారగాయల లభ్యత, ఎస్టేట్ ఆఫీసర్లు, డ్వాక్రా గ్రూపుల ద్వారా రైతు బజార్లలో విక్రయించడం వంటి అంశాలపై సమగ్ర సమాచారం అందజేయాలని సూచించారు. సమీప హోల్‌సేల్ మార్కెట్లు, ఇతర జిల్లాల నుంచి టమోటా సేకరణ మరియు ధరల వివరాలతో నివేదిక అందజేయాలని ఆదేశించారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఉద్యానవన, పౌర సరఫరాలు, మార్కెటింగ్ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేయాలని జేసీ ఆదేశించారు. తనిఖీల సమయంలో ఎదురైన సమస్యలు, పరిష్కారాలతో నివేదికలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

కర్నూలు ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ రాజీనామా

కర్నూలు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు (ఓర్వకల్లు) ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ రణజిత్‌సింగ్ ప్రతాప్‌సింగ్ హజారే తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను ఏపీ ప్రభుత్వం ఈ నెల 21న ఆమోదించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈయనను కర్నూలు ఎయిర్‌పోర్ట్ డైరెక్టరుగా నియమించారు. ప్రభుత్వం మారడంతో తన పదవికి రాజీనామా చేశారు. కర్నూలు ఎయిర్‌పోర్ట్ యూనిట్ హెడ్ సెక్యూరిటీ విద్యాసాగర్‌కు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. రాజీనామా చేసిన రణజిత్ ప్రతాప్‌సింగ్ హజారే ఏపీఏడీసీఎల్ సీఈఓకు చార్జ్ అప్పగించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

న్యాయం చేయాలంటూ టవర్ ఎక్కిన యువకుడు

పాణ్యం, జూన్ 24 : పాణ్యం అయ్యపురెడ్డి కాలనీకి చెందిన కమలపురి శ్రీనివాసులు సోమవారం సమీప సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు రంగంలోకి దిగి శ్రీనివాసులును టవర్ నుంచి కిందికి దించారు.

వైసీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గడివేముల, జూన్ 24: మండలంలోని ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. గ్రామానికి చెందిన అరవింద్, అతడి స్నేహితులు చర్చి వద్ద ఆదివారం సాయంత్రం కూర్చొని ఉండగా అదే గ్రామానికి చెందిన చంద్రతో వాగ్వివాదం జరిగింది. ఈ ఘటనపై గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి వారిని బెదిరించారు. అరవింద్ బావ విజయ్ సోమవారం లక్ష్మిరెడ్డికి ఫోన్ చేసి తమ వాళ్లను ఎందుకు బెదిరించారని అడుగగా ఇంటి వద్దకు వచ్చి మాట్లాడమని చెప్పారు. దీంతో అరవింద్, విజయ్, విజయ్ మామ గంటపోగు తిరుపాల్ వైసీపీ నాయకుల ఇంటి వద్దకు వెళ్లగా తమకే ఫోన్ చేసేంత పెద్దవాడివయ్యావా అంటూ కులం పేరుతో దూషించి వైసీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, అబ్బాస్, రమణారెడ్డి, మల్లారెడ్డిలు ముగ్గురిపై దాడి చేశారు. బాధితుడు తిరుపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విజేతలు నంద్యాల జిల్లా ఎద్దులు



రాతిదూలం లాగుతున్న ఎద్దులు

సంజామల, జూన్ 24 : నొస్సం గ్రామంలో జరిపిన బుగ్గ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీలలో నంద్యాల జిల్లా గుంపరమాను దిన్నె రాంభూపాల్ రెడ్డి ఎద్దులు మొదటి విజేతగా నిలిచి రూ 80000 నగదు బహుమతిని గెలుచుకున్నాయి. సీనియర్ విభాగంలో హోరాహోరీగా జరిగిన పోటీలలో రాష్ట్ర నలమూలాల నుండి పోటీలలో ఎద్దులు పాల్గొన్నాయి. ద్వితీయ స్థానంలో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవ రెడ్డి, కంబైండ్ పురుషోత్తమ్ రెడ్డి ఎద్దులు మూడో స్థానంలో, కడప జిల్లా మైదుకూరుకు చెందిన కెవియస్ బుల్స్ కుర్రా వెంకటేశ్ యాదవ్, 4వ స్థానంలో వైఎస్ఆర్ జిల్లా చౌటుపల్లెకు చెందిన వార్తల చంద్ర ఓబుల్ రెడ్డి ఎద్దులు, 5వ స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులు ఎద్దులు, 6వ స్థానంలో వైఎస్సార్ జిల్లా బాలుగారి పల్లెకు చెందిన ఇందిరెడ్డి రమణా రెడ్డి ఎద్దులు, 7వ స్థానంలో నంద్యాల జిల్లా మూడురాళ్ల పల్లెకు చెందిన పులి చిన్న ఓబుల్ రెడ్డి ఎద్దులు, 8వ స్థానంలో వైఎస్ఆర్ జిల్లాకు చెందిన వైఎంఆర్ కాలనీకి చెందిన గురివి రెడ్డి ఎద్దులు, 9వ స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన కె రమేష్ ఎద్దులు విజేతలుగా నిలిచాయి. ఈ ఎద్దుల యజమానులకు రూ.80000, రూ 60000, రూ 50000, రూ.40000, రూ.30000, రూ.20000, రూ.12000, రూ.10000 ప్రోత్సాహ నగదును ఆలయ కమిటీ వారు అందజేశారు.

ముదుమలగుర్తిలో చోరీ

● నగదు, ఆభరణాల అపహరణ

కోడుమూరు (రూరల్), జూన్ 24: మండలంలోని ముదుమలగుర్తిలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి నగదు, నగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రాధాక్రిష్ణారెడ్డి, శోభావతి దంపతులు గత శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి తిరుమల బయల్దేరారు. అయితే సోమవారం ఉదయం ఇంటి ముందు కళ్లాపి చల్లి ముగ్గు వేయడానికి వెళ్లిన మహిళకు ఇంటి తాళం పగలగొట్టి కనిపించింది. దీంతో ఆందోళన చెందిన సదరు మహిళ ఇరుగుపొరుగు వారిని పిలిచి విషయం తెలిపింది. వారి సాయంతో గృహ యజమానికి సమాచారం అందించారు. యజమాని ఫోన్లో పోలీసులకు విషయం తెలపడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి పరిశోధించారు. సాయంత్రం చేరుకున్న యజమాని రాధాక్రిష్ణారెడ్డి, శోభావతి దంపతులు తమ ఇంట్లో రూ 2.5 లక్షల నగదు, 6 తులాలు బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు చోరికి గురైనట్లు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సినిమా వాళ్లని తక్కువగా చూడకండి

● పవన్ ధైర్యమే ఆయనకు గెలుపును అందించింది

● సినీ నటుడు సుమన్



విలేకర్లతో మాట్లాడుతున్న సుమన్

పత్తికొండ,జూన్24: సినిమా వాళ్లకు రాజకీయం ఏం తెలుస్తుందని తక్కువగా చూడవద్దని సినీ నటుడు సుమన్ అన్నారు. సోమవారం పత్తికొండలో ఆయన విలేకర్లతోమాట్లాడుతూ సినిమా వాళ్లకు ఏమీ తెలియదని అనడం సరి కాదని, దీనికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని అన్నారు. సంకల్ప బలంలో రాజకీ యా ల్లోకి వచ్చిన సినీనటులు ఎందరో రాజకీయప్రభంజనం సృష్టించారని అన్నారు. తమిళనాడులో ఎంజీఆర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ఎలాంటి రాజకీయ అనుభవం లేకపోయినా ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో పార్టీలు స్థాపించి ప్రజల మనసులు గెలుచుకున్నారన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కళ్యాణ్‌ను ఎన్నోవిధాలుగా అవమానాలకు గురిచేశారన్నారు. అదేవి ధంగా పవన్‌కు మొదటిసారి ఓటమి ఎదురైనా, అవమానాలకు భయపడక ప్రజల్లోకి మరోసారి ధైర్యంగా వెళ్లి విజయం సాధించి విమర్శకుల నోరు మూయిం చాడన్నారు. నిబంధనల సడలింపు విషయంలో ప్రభుత్వాలు ముం దుకు రాకపోవడంతో చిన్న సినిమా చితికిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతం లో హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రణాళికలు వేసిన చంద్రబాబు నేడు అమరా వతిని అభివృద్ధికి ప్రణాళికలు అమరావతిని దేశంలోనే అందమైన రాజధానిగా తీర్చిదిద్దాలని అన్నారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె , జూన్ 24 : బనగానపల్లె పట్టణానికి చెందిన ఎరుకలి సీతా మహాలక్ష్మి (22) కడుపుకొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకున్నట్లు సీఐ గంటా సుబ్బారావు సోమవారం తెలిపారు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతురాలి తల్లి సుంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, జూన్ 24: నందికొట్కూరు ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం పట్టణంలోని వేలాంగిని మాత చర్చి ఆవరణలో ఆర్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలను నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసి ప్రజలు వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటుకు టీడీపీ ఎప్పుడూ సహకరిస్తుందన్నారు. మాండ్ర లింగారెడ్డి, కౌన్సిలర్ జాకీర్, లాయర్ జాకీర్, ముర్తుజావళి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు టీడీపీ కట్టుబడి ఉంది

● జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్



దోబీఘాట్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 24: ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు టీడీపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డు గోపాల్ నగర్‌లో రజకులకు నిర్మించబోయే దోబి ఘాట్ ప్రదేశాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఫిరోజ్ మాట్లాడుతూ.. రజకులకు ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే దోబి ఘాట్‌ను నిర్మిస్తామని తెలిపారు. అన్ని సామాజిక వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. గత వైసీపీ పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడంతో ఆ పార్టీ తగిన మూల్యం చెల్లించుకుందని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, వార్డు ఇన్‌చార్జి ఎబినేజర్, నాయకులు పాల్గొన్నారు.

● నంద్యాలలోని నూనెపల్లెలో ఉన్న ఠాగూర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కూల్ కిట్లను అందజేశారు. విద్య ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అస్తవ్యస్తంగా తయారైన ప్రాథమిక విద్యావ్యవస్థను టీడీపీ గాడిలో పెడుతుందని అన్నారు. స్కూల్ భవనాలను ఆధునికీకరిస్తామని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

● నూనె పల్లె వాటర్ ట్యాంకు దగ్గర ఉన్న ఎన్టీఆర్ సుజల ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఫిరోజ్ ప్రారంభించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు నంద్యాలను అభివృద్ధి పథంలో నడపనున్నట్లు చెప్పారు. గతంలో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎన్ఎండీ ఫరూక్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి కృషి చేశారన్నారు. అలాగే జనాభా పెరుగుదలతో భవిష్యత్తులో జిల్లా కేంద్రంలో సాగు నీటి సమస్య ఏర్పడకుండా ఉండేందుకు మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించనున్నట్లు తెలిపారు.

'నాణ్యమైన భోజనం అందించాలి'

కొత్తపల్లి, జూన్ 24: వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ తిరుపతయ్య ఆదేశించారు. మండలంలోని పాలెంచెరువులోని గిరిజన ఆశ్రమ పాఠశాల, కొత్తపల్లిలోని కస్తూర్బా గాంధీ, బీసీ బాలుర వసతి గృహాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే ఆయా హాస్టళ్లలోని విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి హాస్టళ్ల వార్డెన్లకు పలు సూచనలు సలహాలు చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారా? లేదా? అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో హాస్టళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల హాస్టళ్ల వార్డెన్లు పలు జాగ్రత్తలు తీసుకోవాలనిసూచించారు. ఇదిలా ఉండగా.. పాలెంచెర్వు గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం లీవులో ఉండగా.. వార్డెన్ లాంగ్‌లీవ్‌లో వెళ్లినట్లు తెలిసింది. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్, వీఆర్వోలు వేణుగోపాల్, లింగస్వామి, చంద్రశేఖర్, ఆయా పాఠశాలల వార్డెన్లు ఉన్నారు.

'విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ రివిజన్ చేయాలి'

నంద్యాల టౌన్, జూన్ 24: కోర్టు తీర్పును గౌరవించి బీఎస్ఎన్ఎల్ పదవీ విరమణ ఉద్యోగుల పెన్షన్‌ను రివిజన్ చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నంద్యాల శాఖ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శాఖ అధ్యక్షుడు బీవీ రమణయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్ఏఎస్ పి.రామదాసు, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, గౌరవాధ్యక్షులు యల్లయ్య, జిల్లా కార్యదర్శి రమణ ముఖ్య అతిథులుగా హాజరై సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2017 నుంచి ఉన్న పెన్షన్‌ను రివిజన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా స్థాయిలో సైతం వైద్యం పొందే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సీజీహెచ్ఎస్ సమస్యలు, ఫ్యామిలీ పెన్షన్ సమస్యలను పరిష్కరించాల న్నారు. అనంతరం నంద్యాల శాఖ కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శాఖ అధ్యక్షుడిగా బీవీ రమణయ్య, కార్యదర్శి దేశ ప్రసాద్, కోశాధికారిగా నరసింహులు ఎన్నికయ్యారు. సంఘం నాయకులు అబ్దుల్ సమ్మద్, వెంకటసుబ్బయ్య, నాగనంది, నాయక్, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

ఆత్మకూరు, జూన్ 24: ఈ నెల 25 నుంచి జూలై 3వ తేది వరకు ఆత్మకూరు పట్టణంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి శుక్లం శస్త్రచికిత్స శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సత్యనారాయణ తనయుడు గరిమెళ్ల శ్రీనివాసశర్మ సూచించారు. సోమవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డితో కలిసి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయ రస్తాలోని డాక్టర్ సత్యనారాయణ కాంప్లెక్స్‌లో ఈనెల 25 నుంచి జూలై 1వ తేది వరకు 7రోజుల పాటు ఆప్తాలమిస్ట్‌లతో కంటి పరీశీలనలు చేయనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత కళ్ల జోళ్లు అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కంటి శుక్లం, ఇతర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఈ నెల 29 నుంచి జూలై 3వ తేదీ వరకు ఆత్మకూరులోనే శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. ఏదైనా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తాము వాడే మందులను తీసుకు రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008106566, 8897384164 నంబర్లను సంప్రదించాలని వెల్లడించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ జీవీఎస్ సత్యనారాయణ శర్మ వారి కుటుంబం, చెన్నైలోని శంకర నేత్రాలయ కంటి వైద్యశాల సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా వెండి రథోత్సవం



స్వామి, అమ్మవార్లకు రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, జూన్ 24: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులుజేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి



నృత్యం చేస్తున్న కళాకారులు

రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన సత్య కీర్తి నటథ్‌దామం బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మూషికవాహన, లింగాష్టకం, భో శంభో, శివాష్టకం, శివపాద మంజీరం, నమఃశివాయ గంగాధరాయ, హిమగిరి తనయే, శివతాండవం తదితర గీతాలకు కళాకారులకు నృత్య ప్రదర్శనతో అలరించారు.

నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రేణుకాదేవి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 24: నంద్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రేణుకాదేవిని నియమిస్తూ వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. డా.ఎ.రేణుకాదేవి కర్నూలు మెడికల్ కాలేజీలో మైక్రోబయాలజి విభాగపు హెచ్‌వోడీతో పాటు వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డా.ఎ.రేణుకాదేవికి వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అడిషనల్ డీఎంఈగా పదోన్నతి కల్పించి నంద్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు.

ఆలయ భూములకు కౌలు వేలం

బండిఆత్మకూరు, జూన్ 24: మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో వెలసిన చెన్నకేశవ, రామేశ్వర స్వామి భూముల వేలం పాటలు పోటాపోటీగా కొనసాగాయి. సోమవారం ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో ఈవో నాగప్రసాద్ వేలం పాటలు నిర్వహించారు. రామేశ్వరస్వామికి చెందిన 15.99 ఎకరాల భూములకు గత ఏడాది రూ.3,11,000 రాగా ఈ ఏడాది రూ.3,68,000 లభించిందని, అలాగే చెన్న కేశవస్వామికి చెందిన 10.56 ఎకరాలకు గత ఏడాది రూ.1,51,000రాగా ప్రస్తుతం రూ.2,65,000 లభించిందని తెలిపారు. వేలం పాటలో మొత్తం 45 మంది పాటదారులు పాల్గొన్నారని ఈవో తెలిపారు. కృష్ణనంది ఈవో రాఘవేంద్రశర్మ, రైతులు, గ్రామ పెద్దలు, సిబ్బంది బాలుడు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలంలోని చౌట్కూరు గ్రామంలో సోమవారం ఆలయ భూములు కౌలు వేలం పాటలు నిర్వహించారు. ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి రామలింగారెడ్డి, ఆలయ ఈవో వెంకటరమణ ఆధ్వర్యంలో చెన్నకేశవ, ఆంజనేయ, ఈశ్వర, వీరభద్ర ఆలయ సాగు భూములు 87 ఎకరాల 15 సెంట్లు గ్రామస్థుల సమక్షంలో కౌలు వేలం పాట నిర్వహించారు. 27 మంది రైతులు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. వేలం పాటలో ఈ ఏడాది రూ.10.87 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.287 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మదార్‌సాహేబ్, నరసింహగౌడు, నడిపి వెంకటేశ్వర్లు, స్వాములు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

27న వేలం పాట

నంద్యాల కల్చరల్, జూన్ 24: నంద్యాల కోటవీధిలో వెలసిన బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూములు కౌలు వేలం రూములు బాడుగకు బహిరంగ వేలం 27వ తేదీన ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. షాపు నెంబరు 22-140, ఖాళీ స్థలం, సర్వేనెంబరు 1181, 1195-1,1195-3లలో ఆలయానికి చెందిన భూములు మూడేళ్లకు కౌలుకు బహిరంగ వేలము నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో 27వ తేదీన ఉదయం 10గంటలకు బహిరంగ వేలములో పాల్గొనాలని ఈవో తెలిపారు. వేలము పాట నియమ నిబంధనల కోసం ఆసక్తి కలిగిన వారు, వేలం పాటలో పాల్గొనువారు మరిన్ని వివరాలకు ఆయా ఆలయాల ప్రాంగణంలోని కార్యాలయంలో సంప్రదించాలని ఈవో తెలిపారు.

'వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకోవాలి'



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూన్ 24: రైతులు వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించుకోవాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు సూచించారు. సోమవారం ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఖరీఫ్ 2024-25 సంవత్సరానికి సంబంధించి 50శాతం సబ్సిడీపై అర్హులైన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ.. గ్రామీణ విత్తన పథకం కింద వరి, మినుము విత్తనాలను పంపిణీ చేశామని చెప్పారు. అదేవిధంగా పచ్చిరొట్ట ఎరువుల సాగు కోసం జీలుగ విత్తనాలను కూడా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కాగా రైతులు కృత్రిమ ఎరువుల జోలికి వెళ్లకుండా వీలైనంత వరకు సేంద్రియ ఎరువులను ఉపయోగించుకోవాలని సూచించారు. తద్వారా వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గడంతో రాబడి పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. కాగా ఈ సమావేశంలో ప్రధానంగా సబ్సిడీ కింద మొక్కజొన్న విత్తనాలు, సూక్ష్మపోషకాలను సబ్సిడీ కింద ఇవ్వాలని, నీటి పైపులు, ఆయిల్ ఇంజన్లు, టార్పాలిన్లు రైతు గ్రూపులకు కాకుండా వ్యక్తిగతం సబ్సిడీపై మంజూరు చేయాలని, గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచూ రైతులకు రైతు బంధు పథకాన్ని వర్తింపజేయాలని, గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం కింద అధిక యూనిట్లు మంజూరు చేయాలని రైతులు కోరారు. మండల వ్యవసాయశాఖాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తిరుపమయ్య, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, మాజీ ఎంపీపీలు కొండలరావు, ఫుల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు టపాల్ అష్రఫ్ అలి, శరత్ తదితరులు ఉన్నారు.

మహానందిలో పల్లకీ సేవ



మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

మహానంది, జూన్ 24: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీ సేవను ఆలయ వేదపండితులు, అర్చకులు మహానందీశ్వరునికి ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపం వద్దకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. వేదపండితులు శాంతారాంభట్, అర్చకులు మామిళ్ళపల్లి రాఘవశర్మలు వేదమంత్రాలతో ఉత్సవమూర్తులను పల్లకిలో ఆశీనులు చేశారు. భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు.

బీసీ వసతి గృహం తనిఖీ

గడివేముల, జూన్ 24: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని సోమవారం తహసీల్దార్ జమానుల్లాఖాన్, డిప్యూటీ తహసీల్దార్ గురునాథం తనిఖీ చేశారు. బీసీ హాస్టల్‌లోని వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని అన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటపతి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళాలు

శ్రీశైలం, జూన్ 24: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జి.మనోహర్ అనే భక్తుడు రూ. 1,01,116 విరాళం, గుంటూరుకు చెందిన ఎలవర్తి పద్మజ అనే భక్తురాలు కుటుంబ సమేతంగా కలిసి రూ.1,01,116 అందజేశారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

'బోగస్ పింఛన్లను తొలగించాలి'

ఆత్మకూరు, జూన్ 24: ఆత్మకూరు మండలంలోని అమలాపురం గ్రామంలో ఉన్న బోగస్ పింఛన్లను తొలగించాలని గ్రామానికి పలువురు సోమవారం మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో భర్తలు ఉన్నప్పటికీ భార్యలకు వితంతు పింఛన్లు, భార్యాభర్తలు వేర్వేరు రేషన్‌కార్డులను సృష్టించుకుని విడివిడిగా పింఛన్లు పొందడం, డప్పు, చర్మ కళాకారులు కానప్పటికీ వారికి పింఛన్ల మంజూరు వంటి అక్రమాలు జరిగాయని ఆరోపించారు. విషయాలను గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రమణకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈఅక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి'

నందికొట్కూరు, జూన్ 24: పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని నందికొట్కూరు పట్టణంలో పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, ఆసుపత్రుల పరిసరాలు, పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చాంబర్‌లో డా.షైనీ ప్రియాంక, సీడీపీవో, సూపర్వైజర్, శానిటరీ ఇనిస్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు, సచివాలయ వార్డు అమెనిటీ సెక్రటరీలు, మిగతా సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నీటి సరఫరాలో నీరు కలుషితం కాకుండా ప్రతి రోజు నీటిని సంబంధిత వార్డు అమేనిటీ సెక్రటరీలు క్లోరిన్ టెస్ట్ చేయాలన్నారు. పట్టణంలోని ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం తీసుకునే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాని, ఐదేళ్లలోపు పిల్లలకు జింకు టాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

ఆత్మకూరు రూరల్, జూన్ 24: సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ సూచించారు. సోమవారం నాగలూటి చెంచుగూడెంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ రమణమ్మ, సీహెచ్‌వో శివ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటం వల్ల ఎక్కడబడితే అక్కడ వర్షపు నీరు నిలిచి దోమలు ప్రబలేందుకు ఆస్కారం ఉందని చెప్పారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు వస్తాయన్నారు. గిరిజనులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అప్పుడే రోగాలు దరి చేరవని సూచించారు. అనంతరం చెంచు గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు.

నాయకుల సంబరాలు





నందికొట్కూరులో, ప్రాతకోట గ్రామంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు, టీడీపీ నాయకులు

నందికొట్కూరు, జూన్ 24: నంద్యాల ఎంపీ బైరెడ్డి డా.శబరి ఢిల్లీలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా నందికొట్కూరు పట్టణంలో ఆమె అభిమానులు కేక్ కట్ చేసుకొని సంబరాలు చేసుకున్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గూడూరు రవి కుమార్ ఆధ్వర్యంలో సిరి ప్లాస్టిక్ ట్రేడర్స్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస ఫర్టిలైజర్ అధినేత శ్రీనివాస్, తిరుమలేష్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రావు, వడ్డే వేణు, సాయిమహేష్, తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: టీడీపీ పార్లమెంట్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నంద్యాల లోక్‌సభ సభ్యురాలు బైరెడ్డి డా. శబరి నియామకంతో సోమవారం మండలంలోని ప్రాతకోట గ్రామంలో టీడీపీ నాయకుడు అలీ హుస్సేన్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. గ్రామంలో పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా మొట్టమొదటి ఎంపీగా బైరెడ్డి శబరి విజయం సాధించి పార్లమెంట్ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంపీ బైరెడ్డి డా. శబరి భవిష్యత్తులో మరిన్ని పదవులు దక్కాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్ కార్మికులకు అలవెన్స్ ఇవ్వాలి'



కలెక్టర్, జేసీతో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల టౌన్, జూన్ 24: ఎన్నికల్లో పని చేసిన మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక అలవెన్స్‌లు ఇవ్వాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి గౌస్, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి బాస్కరాచారి కోరారు. సోమవారం కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డిలను కలిసి మున్సిపల్ కార్మికుల సమస్యపై వివరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా మే 13వ తేదీన జరిగిన పోలింగ్ సందర్భంగా నంద్యాల మున్సిపాలిటీకి సంబంధించి అవుట్ సోర్సింగ్, వాటర్ వర్క్స్ విభాగాలకు చెందిన 120 మందికిపైగా కాంట్రాక్టు కార్మికులు విధుల్లో పాల్గొన్నారని చెప్పారు. పోలింగ్ రోజు విధి నిర్వహణలో ఉండే అధికార యంత్రాంగానికి, ఓటు వేయడానికి వచ్చిన ప్రజలకు మంచినీటి సరఫరా, తదితర సేవలు అందించారన్నారు. పోలింగ్ ముందురోజు వచ్చిన బాక్స్‌ల దిగుమతి, వాటిని పోలింగ్ కేంద్రాలకు చేర్చడం, పోలింగ్ పూర్తయ్యాక బాక్స్‌లను బస్సులకు ఎక్కించి స్ట్రాంగ్ రూమ్‌లకు చేరేంత వరకు అర్ధరాత్రి వరకు పని చేయించారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టు కార్మికులు చేసిన సేవలకు ఇతర అధికారులకు చెల్లించిన విధంగా ప్రత్యేక అలవెన్స్‌లు ఏమీ చెల్లించలేదని అన్నారు. ఎన్నికల విధుల్లో పాలుపంచుకున్న కార్మికులకు మిగతా ఉద్యోగుల మాదిరిగానే అలవెన్స్‌లు ఇప్పించాలని కలెక్టర్, జేసీని కోరారు. కార్మిక సంఘం నాయకులు ఆదాము, రామాంజనేయులు, సిద్ధయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెయిర్ సెలూన్ దుకాణంలో చోరీ

పాణ్యం, జూన్ 24: పాణ్యంలోని సాయిరాం హెయిర్ సెలూన్ షాపులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.20 వేల విలువైన సామగ్రి ఎత్తుకెళ్లినట్లు షాపు యజమాని రామకృష్ణ తెలిపారు. షాపు వెనుక వైపు రేకులు తొలగించి ఫ్యాను, హోమ్ థియేటర్, రెండు ట్రిమ్మర్లు స్పీకర్ బాక్సు దొంగిలించినట్లు తెలిపారు. అలాగే పక్కనున్న చేపల అంగడిలో పది కిలోల చేపలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు రామచంద్రుడు తెలిపారు. షాపులోని సీసీ కెమెరాల వైర్లు కోసి దొంగతనం చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు.

'పిల్లలను బడికి పంపించాలి'

పాణ్యం, జూన్ 24: విద్యార్థులను తల్లిదండ్రులు తప్పనిసరిగా బడికి పంపించాలని ఎంఈవో సుబ్రహ్మణ్యం సూచించారు. ఇందిరానగర్‌లో సోమవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలను బడికి అలవాటు చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎంఈవో సూచించారు. ముఖ్యంగా చెంచులు తమ పిల్లలను బడికి పంపడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హెచ్ఎం మేరీసునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలి'

మిడుతూరు: ప్రతి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించి బడిఈడు పిల్లలందరినీ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు రామిరెడ్డి, శ్రీనాథ్ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని హెచ్ఎంలతో సోమవారం మిడుతూరులోని ఎంఈవో కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి, బడిలో చేరిన పిల్లల డేటాను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని తెలిపారు. ఆర్‌పీలు మధు, చంద్ర వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

'ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలి'

ఆత్మకూరు, జూన్ 24: ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని కేవీపీఎస్ నాయకులు ఏసురత్నం, సంపత్, చిన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వాములు కోరారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంతోకాలంగా ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అయితే గత వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను రద్దు చేసే ప్రయత్నం చేశారన్నారు. అదేక్రమంలో ఎస్సీ కాలనీలకు వెలుపల ఉన్న వారిని ఉచిత విద్యుత్‌న అమలుచేయకుండా బిల్లులు జారీ చేస్తున్నారని తెలిపారు. కొత్త ప్రభుత్వంలో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీ, ఎస్టీలకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

'విధుల్లోకి తీసుకోవాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 24: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్కావెంజర్లను, మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం అన్యాయమని, వారిని వెంటనే విధల్లోకి తీసుకొవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, బాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో డీఈవో సధాకర్‌రెడ్డికి స్కావెంజర్లు, సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. వారిపై రాజకీయ వేధింపులు సరికాదని అన్నారు.

'సంక్షేమ పాలనలో భాగస్వాములు కావాలి'



సచివాలయ సిబ్బందికి స్వీట్లు పంచుతున్న టీడీపీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 24: కూటమి సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందించే విధంగా సచివాలయ సిబ్బంది భాగస్వామ్యులు కావాలని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పల్లె చిన్న వెంకట సుబ్బయ్య కోరారు. సోమవారం 26 వార్డులో సచివాలయ కార్యాలయానికి వెళ్ళి టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. సిబ్బందికి వెంకట సుబ్బయ్య స్వీట్లు పంచి పెట్టారు. కూటమి మేనిఫెస్టో ప్రకారం ప్రజలకు ప్రజా సంక్షేమ పాలన అభివృద్ధిని చంద్రబాబు అందించనున్నారని అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సేవలందించాలని వృత్తి పరంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో 27వ వార్డు మాజీ కౌన్సిలర్, టీడీపీ సీనియర్ నాయకులు దస్తగిరి, సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు పక్కనే చెత్త కాల్చివేత

● వాహనదారులు, ప్రయాణికుల అవస్థలు



80బన్నూరు గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కనే చెత్తను తగలబెట్టిన దృశ్యం

జూపాడుబంగ్లా, జూన్ 24: గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను చెత్తసేకరణ కేంద్రానికి తరలించాల్సి ఉండగా, 80 బన్నూరు గ్రామ సమీపంలోని ఇలా జాతీయ రహదారి పక్కనే వేసి తగలబెడుతున్నారు. దీంతో గ్రామపంచాయతీ వనరును కాల్చడమేకాకుండా జాతీయ రహదారిపై వెళుతున్న వాహన దారులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని వాహనదారులు అంటున్నారు. పొగ రోడ్డుపైకి వచ్చిన సమయంలో ఎదురెదురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తను దూరంగా పడేయాలని, లేకపోతే చెత్తసేకరణ కేంద్రానికి తరలించాలని కోరుతున్నారు.

మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 24: మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గృహాల ముందు మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలని అన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్య, మెదడువాపు వ్యాధి లక్షణాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రజని, భూదేవి, పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

చాగలమర్రి, జూన్ 24: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే 117 జీవో రద్దు చేయాలని కోరారు. జీవో రద్దు చేసినట్లైతే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో మార్పుకు శ్రీకారం చుట్టినట్లవుతుందని అన్నారు. ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు రాష్ట్రంలో మాతృభాషగా వెలుగొందుతున్న తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని అన్నారు. 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడ మస్తాన్‌బాష, ఎస్టీయూ సంఘ నాయకులు మహబూబ్‌బాషా, సుబ్బారావు, మాబుహుసేన్, గురు చంద్రుడు, నారాయణరెడ్డి, సురేషప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

చాగలమర్రి, జూన్ 24: మండలంలోని పెద్దబోదనం గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారి సమస్యను పరిష్కరించాలని రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ రమణమ్మకు వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ కడప జిల్లా పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామానికి చెందిన వనిపెంట హరినాథ్‌రెడ్డి పెద్దబోదనం గ్రామంలోని 259 సర్వే నంబర్‌లో పొలం ఉండటంతో ఆ పొలం నుంచి వెళ్లే రైతులకు రహదారి లేదంటూ 6 అడుగుల గుంతను తవ్వారు. 50 మంది రైతులు పొలం పనులు చేసుకోవడానికి ఆ రహదారి వెంట వెళ్లాల్సి ఉంది. పూర్వం నుంచి పొలం పనులు చేసుకునేందుకు ఆ దారి వెంటే వెళ్తున్నామని అన్నారు. ప్రస్తుతం వనిపెంట హరినాథ్‌రెడ్డి ఆ దారి గుండా వెళ్లకుండా అడ్డుపడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు, ఎస్ఐకు ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారం కోసమే మీ కోసం

చాగలమర్రి, జూన్ 24: సమస్యల పరిష్కారం కోసమే కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం మీకోసం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా వేదిక కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు అనూరాధ, ఏఈలు జగ్గయ్య, కొండారెడ్డి, ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

ఎంపీల ప్రమాణ స్వీకారంతో సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న నాయకులు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 24: నంద్యాల ఎంపీగా అత్యధిక మెజార్టీతో ఎన్నికైన డా.బైరెడ్డి శబరిపార్లమెంటులో సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ శ్రేణులు కొలిమిగుండ్లలో సంబరాలు నిర్వహించారు. టీడీపీ యువ నాయకులు గూడురు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో టపాసులు పేల్చుతూ, కేకు కట్‌చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో గూడురు నాగేశ్వరరెడ్డి, ఎమ్మార్పీస్ దస్తగిరి, నిమ్మకాయల దస్తగిరి, బొట్టుస్వామి, వెంకటరాముడు, రాజనేని బ్రదర్, దాసరి బ్రదర్స్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు



కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23: కొలిమిగుండ్లకు చెందిన టీడీపీ నాయకులు అందెరాము, కొప్పుల శివ, కొప్పుల మధు మంత్రి బీసీ జనార్ధనరెడ్డిని కలిశారు. సోమవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

ఉయ్యాలవాడ, జూన్ 24: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్ట సారించాలని ఎంపీడీవో రఘురామ్ తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశ మయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మురుగుకాల్వల్లో పూడికలు తీసి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేంద్రరెడ్డి,ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ ఫణిత్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

ప్యాపిలి, జూన్ 24: భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. భోజనంతో పాటు వసతి గృహాల్లో పరిశుభ్రతను పాటించాలని వర్డన్‌లకు సూచించారు. డీటీ మారుతి, వీఆర్వో సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

పసుపు పచ్చని జూన్

- ఎకరాకు వెయ్యి కేజీల విత్తనం అవసరం
- అన్నీ అనుకూలిస్తే మంచి లాభం
- విత్తన శుద్ధి తప్పనిసరి



రుద్రవరంలో మొలకెత్తిన విత్తనం పసుపును గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

రుద్రవరం, జూన్ 24: ఖరీఫ్ సీజన్‌లోని జూన్ మాసం పసుపు సాగుకు అనుకూలం. గతంలాగే ఈ ఏడాది కూడా పసుపు సాగులో రైతులు నిమగ్నమయ్యారు. కుప్పలుగా పోసి మొలకెత్తిన తరువాత పసుపు గ్రేడింగ్ చేసి విత్తనశుద్ధి అనంతరం పొలంలో నాటుతున్నారు. శుద్ధి చేసిన వెయ్యి కేజీల విత్తనాలను ఒక ఎకరాలో నాటుతున్నారు. ట్రైకోడెర్మా కలిపిన నీటిలో పసుపు కొమ్ములను నానబెట్టి శుద్ధి చేశారు. కొమ్ములను గంపలలో నింపి నీరు కారిన తరువాత పొలానికి తీసుకెళ్లి నాటుతున్నారు. విత్తన పసుపుకు శుద్ధి తప్పనిసరిగా చేయాలి. చేసినప్పుడే మొలక శాతం పసుపు దిగుబడి బాగుంటుంది. పురుగు ఆశించకుండా విత్తన శుద్ధి కాపాడుతుంది.

ఎకరాకు వెయ్యి కేజీలు

ఒక ఎకరాకు నాలుగు పుట్ల వెయ్యి కేజీల పసుపు నాటుతున్నామని రైతులు తెలిపారు. పసుపు కోసిన వెంటనే మండె కట్టి పైన చెత్త వేసి పశువుల ఎరువుతో అలికి మొలక వచ్చిన వెంటనే పసుపు గ్రేడింగ్ చేసి నాటిస్తున్నారు. ఒక్కో ఎకరాకు వెయ్యి కేజీలు నాటుతున్నారు. మొలక బాగా వచ్చిన పసుపు దుంపలు నాటితే దిగుబడి బాగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. జూన్ మాసం అనుకూలం కావడంతో పసుపు సాగులో రైతులు నిమగ్నమయ్యారు.

కాలనీలలో సమస్యలను పరిష్కరించాలి

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

బేతంచెర్ల, జూన్ 24: పట్టణంలోని ఆయా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సుబ్బారెడ్డి కాలనీ, సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంజీవనగర్ కాలనీలో ప్రజలకు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు మహిళల సామూహిక మరుగుదొడ్లు, తాగునీటి సమస్య విద్యుత్ సమస్యలు ఉన్నాయనీ ఎమ్మెల్యేకు విన్నవించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు కేంద్రానికి రావడానికి, వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉందని, అంగన్‌వాడీ కార్యకర్త రాదాదేవి వివరించారు. అదేవిదంగా హనుమాన్‌నగర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక విద్యార్థులు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారుల చుట్టూ తిరిగి విన్నవించిన పరిష్కరించడం లేదన్నారు. హనుమాన్ నగర్‌లో టీడీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు టైలర్ రాముడు ఎమ్మెల్యే కోట్లకు విల్లు, అమ్ములు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయితీ కమిషనర్ రమేష్‌బాబు, నగర పంచాయితీ ఏఈ శేఖర్, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, వార్డు కౌన్సిలర్లు రామాంజనేయులు, విజయలక్ష్మి, రామ్మూర్తి, రామగోపాల్, నంద్యాల మధు, తిరుమలేశ్ చౌదరి, భీమేశ్వరరెడ్డి, రవీంద్ర నాయక్, ఎరుకుల చెరువు శివ, మేకల నాగరాజు రూబెన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు, పట్టణ ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఉత్తమ సేవలందించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మండల అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో మండల ప్రభుత్వ అధికారులకు సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అమలు చేసే ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన వారందరికీ పార్టీలకతీతంగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, బుగ్గన ప్రసన్నలక్ష్మి, షేక్షావలి చౌదరి, భీమేశ్వరరెడ్డి, ఎరుకుల చెరువు శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహకులు నాణ్యమైన పౌష్టికాహార భోజనాన్ని అందించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం మండలంలోని ఎం.పెండేకల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో జరిగే కార్యక్రమాలను ముగించుకుని వెల్దుర్తి మీదుగా లద్దగిరి వెళ్తున్న ఎమ్మెల్యే కోట్ల మార్గమధ్యలో జడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు అందించే భోజనం పథకాన్ని పరిశీలించారు. పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు.

ఆక్రమణలో పాఠశాల



ఆక్రమణలో ఉన్న పసుపుల ఎంపీపీ పాఠశాలలో సిమెంట్ బస్తాలు దించుతున్న దృశ్యం

బనగానపల్లె, జూన్ 24 : మండలంలోని పసుపుల గ్రామంలో ఉన్న ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఆక్రమణకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు లక్ష్మీరంగయ్య అనే వ్యక్తి ఎంపీపీ పాఠశాలను ఆక్రమించుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గత మూడు సంవత్సరాల కింద ప్రాథమిక పాఠశాల కబ్జాకు గురైనా హెచ్ఎం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పాఠశాల గదులను ఆక్రమించుకొని సిమెంట్ బస్తాలు దించుకొని లక్ష్మీరంగయ్య వ్యాపారం చేసుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తాము హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా ప్రాథమిక పాఠశాలను స్వాధీనం చేసుకొని విద్యార్థులకు ఉపయోగ పడేలా తీర్చిదిద్దాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఖాళీ చేయిస్తాం: ఎంఈవో స్వరూప

పసుపుల గ్రామంలో ఎంపీపీ పాఠశాల ఆక్రమణకు గురైనట్టు ఫిర్యాదు వచ్చింది. త్వరలో పాఠశాలలో ఉన్న సిమెంట్ బస్తాలను ఖాళీ చేయిస్తాం. పాఠశాలను ఆదీనంలోకి తెచ్చుకుంటాం.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

చాగలమర్రి, జూన్ 24: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. చాగలమర్రి ఎమ్మార్సీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మండలంలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 31 వేల నోట్ పుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలని హెచ్ఎంలకు ఆదేశించామని అన్నారు. 37 వేల పాఠ్యపుస్తకాలను కూడా ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశామని అన్నారు.

ఉద్యోగిని తొలగించండి



ఏపీవోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామ సర్పంచ్, కార్యదర్శి

ఉయ్యాలవాడ, జూన్ 24: సంతకాలు ఫోర్జరీ చేసి గ్రామ సభ తీర్మానం ఇచ్చిన తుడుములదిన్నె గ్రామ ఫీల్డ్ అసిస్టెంటుపై చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ షేక్ మాబుషరీఫ్, గ్రామ కార్యదర్శి సతీష్‌కుమార్‌లు ఫిర్యాదు చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని ఏపీవో రవిప్రకాశ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామఫీల్డ్ అసిస్టెంటు మోహన్‌రావు 2023 సెప్టెంబరు 16న తమ సంతకాలు ఫోర్జరీ చేసి గ్రామ సభలో తీర్మానం చేసినట్లుగా అధికారులను మోసగించారన్నారు. తాము సంతకాలు చేయలేదని ఏపీవో ముందు వాపోయారు. ఫోర్జరీ సంతకాలు చేసిన ఫీల్డ్‌అసిస్టెంటుపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఏపీవో స్పందిస్తూ దీనిపై విచారణ జరిపి జిల్లా పీడీకి రిపోర్టు చేస్తామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రుద్రవరం, జూన్ 24 : ప్రజలు డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామచంద్ర అన్నారు. సోమవారం అధికారులతో మండలపరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎంపీడీవో మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు అతిసార వ్యాధి నివారణ సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంక్‌లను శుభ్రపరచడంతో పాటు పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించకుండా మురికి కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, పీఆర్ఏఈ వెంకటరాముడు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

చాగలమర్రి, జూన్ 24: చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో అక్రమంగా విక్రయిస్తున్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమణయ్య సోమవారం తెలిపారు. కడప జిల్లా రాజుపాలెం మండలం పగిడాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంతెనకు మోక్షమెన్నడో..?

23 ఏళ్లయినా పూర్తి కాని పనులు



అసంపూర్తిగా రాంపల్లె వంతెన

చాగలమర్రి, జూన్ 24: మండలంలోని పెద్ద బోదనం నుంచి రాంపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో లక్షలాది రూపాయలు వెచ్చించి చేపట్టిన వక్కిలేరు వంతెన పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. 23 ఏళ్లు గడిచిన పనులు నేటికి పూర్తి కాలేదు. గత టీడీప హయంలో ఈ వంతెన పనులను రూ.20 లక్షలతో చేపట్టారు. ఆ నిధులతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి 75 శాతం పూర్తి చేసి నిధులు సరిపోలేదంటూ వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి గుంతలమయం

సచివాలయానికి వెళ్లేదెట్లా?



గుంతల రహదారి

రుద్రవరం, జూన్ 24 : మండలంలోని పేరూరు, బి. నాగిరెడ్డిపల్లె గ్రామాల మధ్య రహదారి గుంతలమయమైంది. రాకపోకలకు ఎలా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి రహదారిలో ప్రయాణం చేయాలంటే నరకయాతనగా ఉందని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సచివాలయ పరిధిలో కొండమాయపల్లె, వెలగలపల్లె, ఆర్.కొత్తూరు, బి.నాగిరెడ్డిపల్లె గ్రామాలు ఉన్నాయి.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు



డోన్, జూన్ 24: రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను సోమవారం టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అమరావతిలోని మంత్రి పేషీలో కొల్లు రవీంద్రను కలిసి బీసీ సెల్ జిల్లా కమిటీ తరుపున సన్మానించారు.

సమస్యలు తెలపండి

ఆళ్లగడ్డ, జూన్ 24: ఆళ్లగడ్డ మున్సిపాల్టిటీ పరిధిలోని గ్రామాల, వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న తమ సమస్యలు తెలపాలని కమిషనర్ రమేష్‌బాబు కోరారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను తెలపితే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ నరేంద్ర పాల్గొన్నారు.

బలిజ సంఘీయులు ఏకం కావాలి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆళ్లగడ్డ, జూన్ 24: బావితరాలను దృష్టిలో ఉంచుకొని బలిజ సంఘీయులు ఏకం కావాలి ఆ సంఘం నాయకులు సోమవారం పిలుపు నిచ్చారు. ఆళ్లగడ్డలోని బలిజ సంఘీయులు శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పాలాభిషేకం చేశారు. బలిజ సంఘీయులంతా రాజ్యాధికారం కోసం సంఘటితం కావాలని కోరారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే



తిరుమలలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ దంపతులు

ఆళ్లగడ్డ, జూన్ 24: తిరుమల- తిరుపతి శ్రీవారి సన్నిధిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ దంపతులు సోమవారం గడిపారు. వీరు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని వారు ఆకాంక్షించారు.

తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సయ్యదున్నీసా

కోవెలకుంట్ల, జూన్ 23 : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీవో సయ్యదున్నీసా పేర్కొన్నారు. సోమవారం కోవెలకుంట్లలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, ఈవోఆర్‌డి రాధికారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామాల్లో మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే తాగునీరు సరఫరా చేసే కుళాయిలకు మూతలు తప్పనిసరి ఉండాలన్నారు. గ్రామాల్లో మంచినీటి పథకాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా, ట్యాంకర్లను క్రమం తప్పక శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

అవుకు, జూన్ 24 : రైతులకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ అన్నారు. సోమవారం అవుకు పట్టణంలోని ఆర్‌బీకే కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారో ఎప్పటికప్పుడు నివేదిక అందించాలన్నారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. పీఎం కిసాన్ వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలని తెలపామన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

కోవెలకుంట్ల, జూన్ 23 : వైసీపీ నాయకుల ఒత్తిళ్ల వల్ల రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్లు కోరారు. సోమవారం ఎంపీడీవో సయ్యదున్నీసాకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 12 సచివాలయాలు ఉన్నాయన్నారు. వీటిలో 277 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేసేవారమని, అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ నాయకులు వలంటీరు పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో తిరగాలని హుకుం జారీ చేశారన్నారు. వారి ఒత్తిళ్లకు తట్టుకోలేక తమ పదవికి రాజీనామా చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో తిరిగి మమ్మల్ని వలంటీర్లుగా చేర్చుకోవాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

బనగానపల్లె, జూన్ 24 : సమష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం సాధ్యమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. సోమవారం మండలంలోని బీరవోలు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకార్మిక వ్యవస్థపై పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం అన్వర్‌బాషా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రీ సర్వేను రద్దు చేయాలి

డోన్(రూరల్), జూన్ 24: మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు చేస్తున్న భూరీసర్వేను రద్దు చేయాలని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం డోన్ తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో చేపట్టిన రీసర్వేతో పలు రైతుల భూములు గల్లంతయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రుణాల కోసం వెళ్తున్న పలు రైతులకు ఆన్‌లైన్‌లో తమ భూములు కనిపించడం లేదన్నారు. రీసర్వేలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రీసర్వేలను రద్దు చేసి అర్హులైన రైతుల భూములను తిరిగి ఆన్‌లైన్‌లో చేర్చే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌలు వేలం ద్వారా రూ.17.76 లక్షల ఆదాయం



యర్రగుంట్లలో వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల, జూన్ 24 : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో వెలసిన ఆలయాలకు చెందిన 69.2 ఎకరాల భూములకు నిర్వహించిన బహిరంగ కౌలు వేలంపాటల ద్వారా రూ.17.76 లక్షల ఆదాయం వచ్చినట్లు గ్రూపు దేవాలయాల ఈవో బీవీ నరసయ్య సోమవారం తెలిపారు. ఈ భూములకు గత ఏడాది రూ.9.55 లక్షలు రాగా ఈ ఏడాది రైతుల నుంచి మంచి స్పందన రావడంతో రూ.8.21 ల క్షల అదనపు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో రామస్వామి ఆలయానికి చెందిన 21.16 ఎకరాలకు గత ఏడాది రూ.3.4 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.6.62 లక్షలు వచ్చిందన్నారు. ఈశ్వర స్వామికి చెందిన 22.24 ఎకరాలకు గత ఏడాది రూ.3.67 లక్షలు రాగా ఈ ఏడాది రూ.6.63 లక్షలు, అలాగే చెన్నకేశవ స్వామికి చెందిన 25.8 ఎకరాలకు గత ఏడాది రూ.2.48 లక్షలు రాగా ప్రస్తుతం రూ.4.51 లక్షలు వచ్చిందన్నారు. దేవాదాయ శాఖ బనగానపల్లె డివిజన్ తనిఖీ అధికారి హరిశ్చాంద్రారెడ్డి ఈ వేలంపాటలకు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల గ్రూపు దేవాలయాల ఈవో చంద్రుడు, గ్రామ పెద్దలు లక్ష్మిరెడ్డి, జయరామిరెడ్డి, సత్తారు లక్ష్మిరెడ్డి, నాగేశ్వరరావు, ప్రసాద్, నాగిరెడ్డి, రామ్మోహన్, శ్రీరాములు, ఆలయ సహాయకుడు రమణ పాల్గొన్నారు.

చిలకలూరులో పెరిగిన అదాయం

రుద్రవరం, జూన్ 24 : మండలంలోని చిలకలూరు గ్రావంలో ఈశ్వర చెన్నకేశవస్వామి దేవాలయ భూములకు సోమవారం కౌలు వేలం నిర్వహించారు. ఇన్స్‌పెక్టరు హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 38.99 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించారు. గత ఏడాది రూ.4.56లక్షలు ఆదాయం రాగా, ప్రస్తుతం రూ.5.06 లక్షలు ఆదాయం వచ్చింది, గత ఏడాది కంటే రూ.50వేలు ఆదనంగా ఆదాయం వచ్చినట్లు ఈవో నరసయ్య తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల, జూన్ 24: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం సోమవారం అందజేశారు. నగేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వీఆర్ఏలకు రూ.6,500 నుంచి రూ.10,500 జీతం పెంచారన్నారు. అలాగే వీఆర్ఏలకు డీఏ రూ.100 నుంచి 300 పెరిగిందన్నారు. ప్రభుత్వం వీఆర్ఏలందరికీ జీతం పేస్కేల్ అందజేయాలని నామినీలుగా పని చేస్తున్న వారందరికీ వీఆర్ఏలుగానే నియమించాలని కోరారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్

డోన్, జూన్ 24: పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లను సోమవారం తహసీల్దార్ మాదవకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల, కస్తూర్బా, బీసీ బాలికల హాస్టల్, జిల్లా పరిషత్ పాఠశాలలోని ఎస్సీ హాస్టల్‌ను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని హాస్టళ్లలో విద్యార్థులకు అందించే భోజనంను పరిశీలించారు. అదే విధంగా విద్యార్థులకు పుస్తకాలు అందించారా లేదా అన్న వాటిపై రికార్డులను తనిఖీ చేశారు. హాస్టళ్లలోని మరుగుదొడ్లను పరిశీలించారు. మోడల్ స్కూల్, బీసీ బాలికల హాస్టళ్లలో మరుగుదొడ్ల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధ్యాయుల బోధన ఎలా ఉందన్న దానిపై విద్యార్థినులను అడిడి తెలుసుకున్నారు. హాస్టళ్లలో ఉన్న మరుగుదొడ్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ మాదవకృష్ణారెడ్డి తెలిపారు.